క్లుప్తంగా

గుండెపోటుతో హోంగార్డు మృతి



రాయపర్తి (వర్ధన్నపేట) : గుండెపోటుతో హోంగార్డు మృతి చెందిన ఘటన వర్ధన్నపేటలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం .. వర్ధన్నపేట మండలంలోని ఇల్లందకు చెందిన రాయపురపు రాములు (54) వర్ధన్నపేటలోని పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన బుధవారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో కట్రాల గ్రామ శివారులోని మల్లన్న ఆర్చి వద్ద గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు 108 వాహనంలో రాములును ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మేకపోతు..

రాయపర్తి : విద్యుదాఘాతానికి గురై మేకపోతు మృతి చెందిన ఘటన మండలంలోని కొలన్‌పల్లి శివారు జయరాంతండాలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత పాడి రైతు లావుడ్య మంగ్యా కథనం ప్రకారం.. మంగ్యాకు చెందిన సుమారు రూ.25 వేల విలువైన మేకపోతు బుధవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. అధికారులు తనకు ప్రభుత్వ సహాయం అందించి ఆదుకోవాలని మంగ్యా కోరాడు.

పరామర్శ

గీసుకొండ : స్థానిక ఎంపీటీసీ దౌడు కోమల భర్త, జిల్లా కాంగ్రెస్ నాయకుడు భరత్‌ను అతడి తండ్రి కట్టయ్య అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందిన క్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, తదితరులున్నారు.

మొరిపిరాలలో..



రాయపర్తి : మండలంలోని మొరిపిరాల మాజీ సర్పంచ్ అన్నెడ్డి యాదమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పరామర్శించారు. తొలుత యాదమ్మ చిత్రపటానికి దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం మైలారం గ్రామానికి చెందిన రంగు సాయిలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు జాజునాయక్, పరుపాటి రవీందర్‌రెడ్డి, సుధాకర్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వడ్లకొండ శ్రీనివాస్ కుమారుడు సాయిచరణ్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన అనంతారం గ్రామ శివారులో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని గోపనపల్లికి చెందిన గుండమల్ల సందీప్, అనంతారం గ్రామానికి చెందిన మేకరి దేవేందర్ ద్విచక్ర వాహనంపై వరంగల్ దిశగా వెళ్తుండగా వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లికి చెందిన బొమ్మెర రమేశ్ నడుపుతున్న ద్విచక్ర వాహనం అనంతారం గ్రామ శివారులో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్, దేవేందర్ గాయాలపాలు కాగా ఆస్పత్రికి తరలించారు. సందీప్ తండ్రి రాజమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

'బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి'

గూడూరు : యూనియన్ బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. మేనేజర్ బన్సీలాల్ నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇస్తూ డబ్బులు తీసుకుంటున్నాడని చెప్పారు. మేనేజర్ బన్సీలాల్‌ను ఫోన్‌లో వివరణ కోరగా రామన్ననాయక్ నిబంధలనకు విరుద్ధంగా లోన్ ఇవ్వకపోవడంతో ఆరోపణలతో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపాడు.

లక్ష్యానికి మించి..



పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు

- గత ఏడాది రాష్ట్రంలో జిల్లాకు 8వ స్థానం
- ఈసారి 663 కోట్ల రూపాయల లక్ష్యం
- రుణ ప్రణాళికను ఖరారు చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 9,214 స్వయం సహాయక సంఘాలు

గీసుకొండ: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను అందజేస్తోంది. పొదుపు సంఘాల్లోని పేద, మధ్య తరగతి మహిళలు ఉపాధి వైపు అడుగులు వేస్తూ..ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలవాలనే ఉద్దేశంతో విరివిగా రుణాలు ఇస్తోంది. గత మూడేళ్ల నుంచి జిల్లాలో పలు బ్యాంకులు మహిళా సంఘాలకు లక్ష్యాన్ని మించి రుణాలు ఇచ్చి వారి ఆర్థిక పరిపుష్టికి తోడ్పాటు అందిస్తున్నాయి. గత ఏడాది ఇచ్చిన రుణాల తీరును పరిశీలిస్తే రాష్ట్రంలో జిల్లా 8వ స్థానంలో నిలిచింది.

జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.328.18 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మహిళా సంఘాలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా బ్యాంకులు రూ.381.39 కోట్లు అందజేశాయి. 2022–23 సంవత్సరంలోనూ లక్ష్యాన్ని అధిగమించి రుణాలను ఇచ్చాయి. 2023–24 సంవత్సరంలో రూ. 426.7 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా.. రూ.452.84 కోట్ల రుణాలు ఇచ్చి అదే పరంపర కొనసాగించారు. జిల్లాలో గీసుకొండ మండలం లక్ష్యాన్ని మించి రుణాల పంపిణీలో ముందు నిలిచింది. ఇటీవల హైదరాబాద్‌లో ఏపీఎం సురేశ్‌కుమార్, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కవిత, సుష్మితను మంత్రి సీతక్క సన్మానించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024–25లో జిల్లాలోని 9,214 సంఘాలకు రూ.663.525 కోట్ల లింకేజీ రుణాలను అందించాలని తాజాగా ప్రణాళికను రూపొందించారు.

మండలాల వారీగా బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం

మండలం	సంఘాలు	రుణ లక్ష్యం (రూ.కోట్లలో)
చెన్నారావుపేట	716	51.9178
దుగ్గొండి	972	68.2346
గీసుకొండ	535	48.186
ఖానాపురం	738	48.2876
నల్లబెల్లి	784	56.7897
నర్సంపేట	758	55.9013
నెక్కొండ	1,075	70.2452
పర్వతగిరి	939	64.8802
రాయపర్తి	966	66.2727
సంగెం	1,015	75.1863
వర్ధన్నపేట	716	57.6236
మొత్తం	9,214	663.525

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు..

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా, చిన్న పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో లింకేజీ రుణాలను అందిస్తున్నారు. సంఘాల్లోని సభ్యులకు ఎవరికి రుణాలు అవసరమో ముందుగా తెలుసుకుని పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు, మండల సమాఖ్య నిర్వాహకులు, ఏటేట వారీగా రుణ ప్రణాళికలు తయారు చేస్తారు. కుట్టుమిషన్లు, పిండిగిర్ని, కిరాణం, బట్టల షాపు, గేదెలు, మేకలు, గొర్రెల పెంపకం, వ్యవసాయ పనిముట్లు, పెట్టుబడి సాయం.. ఇలా వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలకు సంబంధించి రుణాలు ఇస్తున్నారు. మహిళల జీవనోపాధి, ఉపాధి మెరుగుపరచడానికి లింకేజీ రుణాలు ఉపయోగపడుతున్నాయి. ఒక్కో సంఘానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల మేర రుణాలు అందిస్తున్నారు.



నెక్కొండ : కేక్ కట్ చేస్తున్న నాయకులు



దుగ్గొండిలో..

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని వర్ధన్నపేట, రాయపర్తి, దుగ్గొండి, సంగెం, ఖానాపురం, నెక్కొండ, పర్వతగిరి, తదితర మండలాల్లో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు.



సంగెం : కేక్ కట్ చేస్తున్న నాయకులు

పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్

పర్వతగిరి : రైతులు వరి, పత్తి పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉషాదయాళ్ సూచించారు. మండలంలోని ఏనుగల్, ఎన్జీతండా, భట్టుతండా గ్రామాల్లో బుధవారం పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగు చేసే రైతులు పెసర, జీలుగ తదితర పచ్చిరొట్ట పైర్లను తప్పని సరిగా వేసుకొని పూత దశలో ఎస్‌ఎస్‌పీ వేసుకొని కలియదున్నాలని తెలిపారు. ప్రస్తుతం వరిలో దీర్ఘకాలిక రకాల నారు పోసుకునే సమయం ముగిసిందన్నారు. జగిత్యాల వరి–2, 3, వరంగల్ సన్నాలు, వరంగల్ సాంబ, జగిత్యాల మసూరి మధ్యకాలిక రకాలను సాగు చేసుకోవాలన్నారు. డబ్ల్యూజీఎల్ –1119, 962, ఆర్‌ఎన్‌ఆర్–15048, కేఎన్‌ఎం–1638, కేఎన్‌ఎం–733 సన్న రకాలను, జేజీఎల్ –24423, కేఎన్‌ఎం–118, 7037, ఎంటీయూ–1010 వంటి స్వల్ప కాలిక రకాలను కూడా సాగు చేయాలని సూచించారు. పొడి దుక్కిలో రైతులు పత్తివిత్తనాలు విత్తుకున్నారని తెలిపారు. నీరులేక మొక్కలు ఎండిపోతాయన్నారు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ప్రతీ లీటరు నీటికి కలిపి మొక్క వేరు భాగం తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ కన్సల్టెంట్ పి.సారంగం, తదితరులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఉషాదయాళ్

ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు



నర్సంపేట : అంగన్‌వాడీ టీచర్లకు ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక వాచకం–1 పుస్తకం ఇస్తున్న సీడీపీఓ

నర్సంపేట : నూతన జాతీయ విద్యావిధానం –2020లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు సీడీపీఓ విద్య తెలిపారు. ఈ మేరకు నర్సంపేట ప్రాజెక్టులో బుధవారం సూపర్‌వైజర్లు పి.రుబీన్స్, కె.మంజుల అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ విద్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా నర్సంపేట ప్రాజెక్టు పరిధిలోని టీచర్లను 9 బ్యాచ్‌లుగా చేసి మూడురోజుల శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు యూనిఫాం కూడా అందజేస్తామని, పూర్తి శిక్షణ పొందిన టీచర్లతో ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా అమ్మఒడి లాంటి అంగన్‌వాడీ కేంద్రంలో మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను చేర్పించాలని ఆమె కోరారు. అనంతరం ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక వాచకం–1, పూర్వ ప్రాథమిక విద్య కరదీపికలను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయరాణి, మాధవి, 36 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



రాయపర్తి : మాట్లాడుతున్న సీడీపీఓ డెబోరా

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

రాయపర్తి (వర్ధన్నపేట): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని వర్ధన్నపేట ఐసీడీఎస్ సీడీపీఓ డెబోరా సూచించారు. వర్ధన్నపేట ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అంగన్‌వాడీ టీచర్లకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ట్రైనర్లు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యాసంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9849004967, 97030661779, 99481000ల్లో సంప్రదించాలని తెలిపారు.

గాలిదుమారానికి రేకుల ఇల్లు నేలమట్టం



చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండాలో జరుకుల తరోనికి చెందిన రేకుల ఇల్లు మంగళవారం రాత్రి వీచిన గాలిదుమారానికి నేలమట్టమైంది. సుమారు రూ.1.50 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం తమకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు.

ఏడాదిలో మూడు ఉద్యోగాలు

- యువతకు ఆదర్శంగా గిరిజన యువకుడు వాంకుడోత్ శ్రీధర్



గీసుకొండ : పట్టుదలతో చదివితే సాధించనిది ఏదీ లేదని నిరూపిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన వాంకుడోత్ బాబు(బాబా)–సరోజ దంపతుల కుమారుడు శ్రీధర్. పదో తరగతి వరకు కొమ్మాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, నర్సంపేటలో ఇంటర్, ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ (కెమిస్ట్రీ) పట్టా అందుకున్నాడు. ప్రస్తుతం అక్కడి రసాయనశాస్త్ర విభాగంలో సీనియర్ ఫెల్లోగా పని చేస్తున్నాడు. నిరంతరం చదువుతూ ఏడాదిలోనే మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. మార్చి 4న ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా, మే 17న ఎన్టీపీసీలో అసిస్టెంట్ కెమిస్ట్ ట్రైనీ (ఏసీటీ)గా ఉద్యోగాలు వచ్చాయి. తాజాగా, ఈ నెల 16న కేంద్ర ప్రభుత్వ కామర్స్ అండ్ ఇండస్ట్రీ విభాగంలో ఎగ్జామినర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ (పేటెంట్ ఆఫీసర్..గెజిటెడ్ హోదా) గా ఎంపికయ్యాడు. అలాగే, మరో రెండు ఉన్నతస్థాయి ఉద్యోగాల ఇంటర్వ్యూలకు ఎంపికయ్యాడు. డీఆర్‌డీఓ సైంటిస్టుగా, నాల్కోలో అధికారి ఉద్యోగాలకు ఎంపికై ఇంటర్వ్యూ కోసం వేచి చూస్తున్నాడు. ఈ సందర్భంగా 'సాక్షి' అతడిని పలకరించగా తనది పేద గిరిజన కుటుంబమని, తల్లిదండ్రులు చదువుకోలేదని, అయినా ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపి కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించానని తెలిపాడు. పేటెంట్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరడానికి సిద్ధం అవుతున్నానని, అయితే మరో రెండు ఉద్యోగాల ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉందని శ్రీధర్ పేర్కొన్నాడు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

చెన్నారావుపేట : విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఏఎస్సై లక్ష్మణమూర్తి సూచించారు. మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సిగరెట్, గుట్కా, అంబర్, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. డ్రగ్స్‌కు అలవడితే జీవితం నాశనం కావడమే కాకుండా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. చదువులు, ఆటపాటలు, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని తెలిపారు. తద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదిగి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. పిల్లలు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, సరైన దిశలో సత్ప్రవర్తనతో మెలిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అండెం కరుణాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్సై లక్ష్మణమూర్తి

రైల్వేస్టేషన్ సమగ్రాభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ అభివృద్ధే ధ్యేయంగా రాజకీయ పార్టీలకు అతీతంగా కృషి చేయాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో కన్వీనర్ గోరంట్ల వెంకట్‌నారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రైల్వే అవర్నెస్ ఫోరం సర్వసభ్య సమావేశంలో రంజిత్‌రెడ్డి మాట్లాడారు. రాబోయే రోజుల్లో స్థానిక రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సాధించడమే అన్ని రాజకీయ పార్టీల, ప్రజాసంఘాలతోపాటు వ్యాపారులు, ప్రజల ఏకైక లక్ష్యం కావాలని ఆకాంక్షించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సాధన కోసం త్వరలో ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారికి రైలు ప్రయాణం సురక్షితమని చెప్పారు. రైల్వేస్టేషన్‌కు ఆదాయం పెంచే దిశగానూ పాటుపడాలని సూచించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



నర్సంపేట రూరల్ : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సంపేటలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన కందికట్ల దేవమ్మ కుమారుడు అజయ్ (22) తన సోదరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలోని దూలానికి ఉరేసుకున్నాడు. అతడు తలుపులు తీయకపోవడంతో స్థానికులు వచ్చి తీసి చూసే సరికి అజయ్ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. అజయ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కేంద్ర మంత్రి సంజయ్‌కి సన్మానం



బండి సంజయ్‌ని సత్కరిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : కరీంనగర్ ఎంపీగా ఘన విజయం సాధించి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా కరీంనగర్‌కు చేరుకున్న సందర్భంగా బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ, జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి బుధవారం గజమాలతో ఘనంగా సన్మానించారు. తొలుత మంత్రికి ప్రభబండ్లతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, దుగ్గొండి, ఖానాపురం, నల్లబెల్లి మండలాల అధ్యక్షులు నేదురు రాజేందర్, ఆబోతు రాజుయాదవ్, బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు జుర్రు రాజుయాదవ్, లూనావత్ కవిత వీరన్న, బోడ గోల్యానాయక్, మహ్మదాపురం పీఏసీఎస్ చైర్మన్ పాడుగుల జీవన్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక బీమాతో ఆర్థిక భరోసా

దుగ్గొండి : సామూహిక బీమాతో కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని భగత్‌సింగ్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు యార మహేందర్ తెలిపారు. మండలంలోని తొగర్రాయి గ్రామంలోని భగత్‌సింగ్ పురుషుల పొదుపు సంఘం సభ్యులు హన్మకొండ రామచంద్రు, హన్మకొండ రఘు, గొర్రె సూరయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు సామూహిక బీమా కింద రూ.70 వేల చొప్పున మహేందర్ బుధవారం అందజేశారు. అనంతరం మహేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సద్ది అమరేందర్, కోశాధికారి నెల్లుట్ల అశోక్, పాలకవర్గ సభ్యులు హన్మకొండ బాబు, గిన్నె విజేందర్, కలువాల నరేందర్, కస్తూరి స్వామి, శ్రీపల్లి స్వామి, తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మహేందర్, తదితరులు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

నర్సంపేట రూరల్ : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గార్లగడ్డ తండాలోని ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. విద్యాసంవత్సరం మొదలయ్యే నాటికే పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరన్న, ఏఏపీసీ చైర్మన్ కమల, సభ్యులు భద్రు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మాత్ర తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ సరోజ

చెన్నారావుపేట : పిల్లలకు నట్టల నివారణ మాత్ర తప్పనిసరిగా వేయాలని డాక్టర్ సరోజ తెలిపారు. జాతీయ నట్టల నివారణ దినోత్సవం (ఎన్‌డీడీ)ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఆశవర్కర్లు, వైద్య సిబ్బందికి బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రెండేళ్లలోపు వయస్కులైన చిన్నారులకు నట్టల నివారణ మాత్ర సగం, రెండు నుంచి పంతొమ్మిదేళ్ల వరకు వయస్సున్న పిల్లలకు 400 ఎంజీ మాత్ర ఒకటి వేయాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నట్టల నివారణ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ రామేల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానికుడు చిర్ర వేణు సొంత ఖర్చుతో బుధవారం నోటుబుక్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించి ఇతరులకు స్ఫూర్తినివ్వాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐరెడ్డి ఎల్లారెడ్డి, నాయకులు దురిశెట్టి రాజు, పరుపాటి యాకూబ్‌రెడ్డి, మహబూబ్‌పాషా, చిర్ర వినయ్, బొమ్మినేని గౌతమ్‌రెడ్డి, దళం సారయ్య, గుంజాల శ్రీకాంత్‌రెడ్డి, కనుకుంట్ల నవీన్, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.